

# ఆగని వర్షం.. అవస్థలు

## గుంతల రోడ్లు.. నిలిచిన వర్షపు నీరు.. బురదమయం

## రాకపోకలకు ఇబ్బందిపడుతున్న వాహనదారులు

చందానగర్: అస్నా తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులు నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ల రోడ్లు గుంతలమయంగా మారాయి. ముసురుతో రోడ్లు చిత్తడిగా తయారయ్యాయి. చందానగర్, గంగారం, ఆర్టీసీ కాలనీ, మదీనాగూడ, ప్రకాష్‌నగర్, వైశాలీనగర్, ఓల్డ్ హఫీజ్‌పేట్ పరిసర ప్రాంతాలలో అంతర్గత రోడ్లపై వరదనీరు ప్రవహిస్తోంది. ఇక మంజీరా రోడ్డు బురదమయంగా మారి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఒకవైపు పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

**ముంపు కాలనీల పరిశీలన..**

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలతో పాటు, సాకి చెరువు, చిన్నవాగు, పాటి గ్రామ చౌరస్తాలోని సబ్‌స్టేషన్ తదితర ప్రాంతాలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టడంతో పాటు నీరు చేరే అవకాశం ఉన్న ప్రాంతాల ప్రజలను తరలించాలని ఆదేశించారు.

**రోడ్లపైకి నీరు..**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాలకు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు జలమయమయ్యాయి. ప్రధానంగా తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం నుంచి కొల్లూర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లే రేడియల్ రోడ్డుపై పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో పోలీసులు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. వరద కాలువలు కబ్జా అవడం వలనే రేడియల్ రోడ్డుపైకి నీరు వస్తున్నాయని స్థానికులు ఆరోపించారు. ఆర్ అండ్ బీ అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించారు.

తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం మీదుగా రింగ్ రోడ్డుకు వెళ్లే రేడియల్ రోడ్డుపై నీటి ప్రవాహం



**భారీగా నిలిచిన వరదనీరు**

పటాన్‌చెరు టౌన్: ముత్తంగి, ఇస్నాపూర్ గ్రామాల నుండి వస్తున్న వరద నీటితో చిట్కుల్ పంచాయతీ పరిధిలో ముంపునకు గురైన ప్రాంతాలను కాంగ్రెస్ నేత నీలం మధు పరిశీలించారు. సోమవారం రాధమ్మ కాలనీ, నాగార్జున కాలనీ, పార్థసారధి కాలనీలలో పర్యటించారు.





చందానగర్‌లో ..

**విద్యుత్ సరఫరాలో అంతరాయం..**

చందానగర్, తారానగర్, మాతృశ్రీనగర్, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో వర్షాల ధాటికి విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు పడి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్లకొమ్మలు 11 కెవీ విద్యుత్ తీగలపై పడడంతో కొన్ని కాలనీలలో గంటల తరబడి విద్యుత్ లేదు. వర్షం పడుతున్నా విద్యుత్ అధికారులు మాత్రం సరఫరాను పునరుద్ధరించారు.



ముత్తంగి రహదారిలో నీటి ఉధృతి



పటాన్‌చెరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



చిట్కుల్ నాగార్జున కాలనీలో.. కాంగ్రెస్ నాయకుడు మధు



బురదమయంగా గంగారం రోడ్డు



మియాపూర్ బొమ్మరిల్లు రెస్టారెంట్ జాతీయ రహదారిపై..

## రెండోరోజూ రాకపోకలు బంద్..

**లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద మోటార్లతో వరదనీటి తొలగింపు**



లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద వరద నీరు

శేరిలింగంపల్లి: ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద రెండోరోజు సోమవారం వరద నీరు ఉండిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలను రైల్వే బ్రిడ్జిపై నుంచి గుల్‌మొహర్‌పార్కు మీదుగా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు మోటార్ల సహాయంతో నీటిని రోడ్డు పక్కన తవ్విన నాలా ద్వారా పోయేలా ఏర్పాట్లు చేశారు. అలాగే శేరిలింగంపల్లి పరిధిలోని పలుచోట్ల ప్రధాన రోడ్లపైకి నీరు రావడంతో తొలగింపు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా లింగంపల్లి నుంచి గచ్చిబౌలివైపు వెళ్లే రోడ్డులో అలిండ్ సంస్థ సమీపంలో బాపూనగర్ ఆంజనేయస్వామి ఆలయం ముందున్న రోడ్డులో నీరు నిలిచిపోగా పక్కనే కచ్చా కాలువ ఏర్పాటు చేసి నీటిని నాలాలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఇదే తరహాలో మరికొన్నిచోట్ల కూడా నీటిని రోడ్డుపైకి రాకుండా ఏర్పాట్లు చేశారు.

**నివారణ చర్యలు చేపట్టాం: ఎమ్మెల్యే గాంధీ**

లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద వరదనీటి నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టామని, అందుకోసం రూ.4 కోట్లతో పనులను చేపట్టామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. బాక్స్‌టైప్ కల్వర్టు, వరదనీటి కాలువ నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరలో చేపడుతామన్నారు. త్వరలో పనులు పూర్తి చేసి ప్రజలకు రాకపోకల విషయంలో సమస్యలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.



లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద వరదనీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్

## చందానగర్ సర్కిల్ -21 పరిధిలో ప్రత్యేక బృందాలు

చందానగర్: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు, ముంపు ప్రాంతాలలో ప్రత్యేక బృందాలను అందుబాటులో ఉంచామని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 18 లేబర్ టీంలు, 4 మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు, 4 వాహనాలు, నలుగురు సిబ్బంది ఒక్కో షిఫ్ట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

## భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలి

గచ్చిబౌలి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచిస్తున్నారు.

- తడిసిన విద్యుత్ స్తంభాలు ముట్టుకోరాదు. ముఖ్యంగా ఇనుప స్తంభాల సమీపంలోకి కూడా వెళ్లకూడదు.
- తడిసిన చేతులతో స్టార్టర్లు, మోటార్లు ,విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను, వాటి కొమ్మలను ముట్టుకోరాదు.
- ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదు.
- బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలి
- చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలి. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయరాదు.
- వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాత బకెట్ తీసుకోవాలి.
- ఉరుములు, మెరుపులు, వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలి

**అత్యవసర ఫోన్ నంబర్లు**

- జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ గ్రీవియెన్స్ నంబర్ : 040–21111111
- ఎమ్మెల్యే గాంధీ కార్యాలయం: 9154525252, 9177762946, 9121448999
- జీహెచ్ఎంసీ కంట్రోల్ నంబర్ : 9704601866
- జీహెచ్ఎంసీ ట్రీ కటింగ్ నంబర్ : 6309062583
- వాటర్ లాగింగ్ నంబర్ : 9000113667
- ఎలక్ట్రిసిటీ కంట్రోల్ నంబర్ : 7382072106

- వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ స్విచ్‌లను ఆఫ్ చేయాలి. షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుంది.
- కరెంటు లైన్ కింద సెల్‌ఫోన్ మాట్లాడరాదు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ డ్యామేజ్ అయితే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

## అపర్ణ నిర్మాణ సంస్థపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు



హైడ్రా కమిషనర్ ఏవిరంగనాథ్‌ను కలిసిన జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల పెద్దచెరువు, గంగారం పెద్ద చెరువులను అపర్ణ నిర్మాణ సంస్థ కబ్జా చేస్తోందని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం ఫిర్యాదు చేశారు. నల్లగండ్ల చెరువులో అపర్ణా సైబర్ లైఫ్, గంగారం చెరువులో అపర్ణా లేక్ బ్రీజ్ పేరిట కబ్జాలకు పాల్పడినట్లు, అందుకు సంబంధించిన ఆధారాలతో కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా సానుకూలంగా స్పందించినట్లు భాస్కర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జనం కోసం సహాయ కార్యదర్శి బాలు తదితరులు పాల్గొన్నారు.

## జలమండలికి 432 ఫిర్యాదులు

బంజారాహిల్స్: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, చాలాచోట్ల మ్యాన్ హోళ్లు, డ్రైనేజీలలో వ్యర్థాలు ఇరుక్కపోయి వరదనీరు పొంగి రోడ్లపై పారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలపై జలమండలి డివిజన్–6 జీఎం హరిశంకర్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, బోరబండ, సనత్‌నగర్, అమీర్‌పేట ప్రాంతాల్లో సెక్షన్ మేనేజర్లతో పాటు సీవరేజీ, మంచినీటి లైన్‌మెన్లు అప్రమత్తం అయ్యారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధి నుంచి వివిధ సమస్యలపై జలమండలికి 432 ఫిర్యాదులు అందాయి. ఇందులో 320 ఫిర్యాదులను పరిష్కరించినట్లు జీఎం తెలిపారు. డ్రైనేజీకి సంబంధించి 197 ఫిర్యాదులు అందాయన్నారు.



లోతట్టు ప్రాంతాల్లో నీటి సరఫరాను పరిశీలిస్తున్న జీఎం హరిశంకర్

ఆరు చోట్ల మంచినీటి నల్లాల్లో కలుషిత జలాలు వస్తున్నట్లుగా ఫిర్యాదులు అందడంతో వెంటనే పరిష్కరించామన్నారు. మంగళవారం సాయంత్రానికి వందశాతం పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

## జల్సాలకు అలవాటు పడి .. దొంగలుగా మారి

- ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్ల చోరీలు .. నలుగురు అరెస్ట్
- 16 ద్విచక్ర వాహనాలు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం



మియాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

మియాపూర్: ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు దొంగతనాలు చేస్తున్న నలుగురిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ దుర్గరామలింగప్రసాద్, డీఐ అక్రమ్ బాబా తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మియాపూర్ హఫీజ్‌పేట్‌లోని సుభాష్‌చంద్రబోస్ నగర్ కాలనీకి చెందిన షేక్ అబ్బు తలీబ్(21) హఫీజ్‌పేట్ ఆదిత్యానగర్‌కు చెందిన అబ్దుల్ రియాజ్ (20), హఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్‌కు చెందిన రక్లావత్ మహేష్ (19), ప్రేమ్‌నగర్‌కు చెందిన సూర్యవంశీ జాషువా (19), హఫీజ్‌పేట్‌కు చెందిన సలామ్ బిన్ అలీ షమీమ్ (24) వీరు ఐదుగురు వేర్వేరుగా పనులు చేసుకుంటున్నారు. జల్సాలకు అలవాటు పడి పనిచేయగా వచ్చిన డబ్బు చాలక సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఇళ్ల ముందు, మెట్రో పార్కింగ్ ఇతరచోట్ల పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు, ఆటో, బస్సులలో ప్రయాణిస్తూ ప్రయాణికుల జేబులో నుండి సెల్‌ఫోన్లు దొంగిలించడమే టార్గెట్‌గా చేసుకున్నారు. దొంగిలించిన వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. వీరు దొంగిలించిన వాహనాలు మియాపూర్, హఫీజ్‌పేట్‌కు చెందిన ఎండీ. ఫసల్, మహ్మద్ షోయల్ అమ్మకాలు చేసేవారు. ఏ1 షేక్ అబ్బు తలీబ్ పై గచ్చిబౌలి పీఎస్‌లో 4,మియాపూర్, మాదాపూర్, చందానగర్, చార్మినార్, మైలార్ దేవ్‌పల్లి, హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయి. కాగా అత్తాపూర్ హుడా కాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగి ప్రణయ్ మే 22వ తేదీ ఉదయం మియాపూర్ మెట్రో స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో తన ద్విచక్ర వాహనం టీవీఎస్ (టీఎస్07జీఆర్5662) పార్క్ చేసి వెళ్లాడు.రాత్రి 10 గంటల సమయంలో వచ్చి చూసే సరికి వాహనం లేదు. దీంతో ప్రణయ్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పోలీసులు మియాపూర్ ఎక్స్ రోడ్డులో వాహనాలు తనిఖీలు చేస్తుండగా అటు వైపు బైక్ పై వచ్చిన షేక్ అబ్బు తలీబ్, అబ్దుల్ రియాజ్, మహేష్, సూర్యవంశీ జాషువాలను అనుమానించి అదుపులోకి తీసుకొని విచారించగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు దొంగిలించింది తామేనని అంగీకరించారు.దీంతో నలుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఐదవ వ్యక్తి సలామ్ బీన్ అలీ షమీమ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి 15 లక్షలు విలువ చేసే 16 ద్విచక్ర వాహనాలు, 12 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

చందానగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో చందానగర్ డివిజన్ పరిధిలోని కెఎస్ఆర్ లేఅవుట్, దీప్తిశ్రీనగర్ లలో లోతట్టు ప్రాంతాలలో ఎమ్మెల్యే గాంధీ సోమవారం కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి పర్యటించారు. అవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జీహెచ్ఎంసీ ఏఈ సంతోష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, చంద్రకాంత్‌రావు, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్ట్‌టైం జాబ్ పేరిట మోసం

**రూ. 52 వేలు పోగొట్టుకున్న ఉద్యోగిని**

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ పేరుతో వచ్చిన మెసేజ్‌కు స్పందించిన ప్రైవేటు ఉద్యోగిని రూ.52 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎంజీ రోడ్డులో నివాసం ఉండే ఓ ప్రైవేటు ఉద్యోగినికి ఆగస్టు 31 తేదీన పార్ట్‌టైం జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో తన వివరాలు నమోదు చేసింది. అపరిచిత వ్యక్తులు నగదు ఇన్వెస్ట్ చేసి ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామని ఆశ చూపారు. దీంతో ఆమె వారు చెప్పిన విధంగా నగదు ఇన్వెస్ట్ చేస్తూ, పలు దఫాలుగా రూ. 52 వేలు పంపింది. చివరికి తాను పెట్టిన నగదుతో పాటు, కమీషన్ ఇవ్వాలని ఉద్యోగిని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## ఘన నివాళి



దివంగత నేత వైఎస్ రాజశేఖరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

మియాపూర్: జన హృదయ నేత దివంగత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం మియాపూర్ మయూరీనగర్ కాలనీలో విశ్రాంత రెవెన్యూ అధికారి కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత సాంఘిక సంక్షేమ సహాయ సంచాలకులు విల్సన్, విశ్రాంత సహాయ సంచాలకులు ఎన్. అబ్బులు, రవికుమార్, శ్రీకాంత్, బషీర్ అలీ, నీరాజ్, అతామ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## నాయనమ్మ కుంట పరిశీలన



లక్ష్మీనగర్ నాయనమ్మ కుంట తూమును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: మియాపూర్ లక్ష్మీనగర్ కాలనీలోని నాయనమ్మ చెరువు తూమును అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్‌రావు, శ్రీనివాస్ యాదవ్, సాంబయ్య, నరేష్, కాలనీవాసులు ఉన్నారు.

## ఉత్సవాలకు గణేష్‌గడ్డ దేవస్థానం ముస్తాబు

**7 నుంచి 17 వరకు వేడుకలు**



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గణేష్‌గడ్డ సిద్ధి గణపతి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతుంది. గణేష్‌గడ్డ ఆలయంలో కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఆలయంలో 108 ప్రదక్షిణలు 11 వారాలు వ్రతం చేయాల్సి ఉంటుంది. దీని వల్ల విద్య, ఉద్యోగం లేని వారు ఉద్యోగాన్ని పొందుతారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్యం బాగుపడుతుందని ప్రతీతి. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు రోజుకు ఒక విశేష అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మొదటి రోజు ఉదయం 6 గంటలకు పంచామృత అభిషేకం, మహాగణపతి పూజ, మహా గణపతి హోమం, ప్రదోష పూజ, గణపతి వ్రత కల్పం, పల్లకీసేవతో ప్రారంభం అవుతుందని, సెప్టెంబర్ 17 ముగింపు రోజున జాతర జరుగుతుంది. పంచామృతాభిషేకం, మహా నైవేద్యం ,మంగళహారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం లడ్డూ వేలం, రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఇంచార్జ్ ఈఓ లావణ్య తెలిపారు.



రుద్రారం గణేష్‌గడ్డ ఆలయం

**క్యూలైన్ ఏర్పాటు**



నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నాం.ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ప్రతిరోజు ఆలయ ఆవరణలో అన్నదానం ఉంటుంది. – ఆలయ ఇంచార్జ్ ఈఓ లావణ్య

**బందోబస్తు ఏర్పాటు చేస్తాం**



నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులు లైన్ లో వెళ్లి దర్శించుకునే విధంగా చూడడంతో పాటు ఆలయానికి వచ్చే వాహనాలు కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేసేలా చూస్తాం. భక్తులు పోలీసులకు సహకరించాలి. – సీఐ ప్రవీణ్ రెడ్డి, పటాన్‌చెరు